GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 322 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | ఆదివారం 14-07-2024 | పేజీలు : 3

## నా కాళ్ళకు దండం పెడితే నేను మీ కాళ్ళకు మొక్కుతా

### దేవుడికి, తల్లిదండ్రులకు మాత్రమే పరిమితం

### పార్టీ నేతలకు, శ్రేణులకు చంద్ర బాబు హిత బోధ



**టీ మీడియా, జులై 13,అమరావతి:**

కాళ్లకు దండం పెట్టే సంస్కృతి వీడాలని సీఎం చంద్రబాబు తెలిపారు. తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నేడు చంద్రబాబు మీడియాతో చిట్‌చాట్ చేశారు.ఎవరైనా నా కాళ్లకు దండం పెడితే, వారి కాళ్లకు నేను దండం పెడతా. ఇవాళ్టి నుంచి నా కాళ్లకు దండం పెట్టే విధానానికి ఫుల్‌స్టాప్ పెడుతున్నా. తల్లిదండ్రులు, భగవంతుడి కాళ్లకు దండం పెట్టాలి తప్ప నాయకులకు కాదు. నాయకుల కాళ్లకు దండం పెట్టి ఎవరూ తమ గౌరవాన్ని తగ్గించుకోవద్దు. నాయకుల కాళ్లకు ప్రజలు, పార్టీ శ్రేణులు దండం పెట్టొద్దనే సంస్కృతి నా నుంచే ప్రారంభిస్తున్నా" అని సీఎం చంద్రబాబు తెలిపారు. అనంతరం ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు.

# పెండింగులు లేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్



## సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు..

**టీ మీడియా, జులై 13,హైదరాబాద్ :**

విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త వినిపించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి.. ఎలాంటి పెండింగులు లేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన 'నాణ్యమైన ఇంజినీరింగ్ విద్య' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇంజినీరింగ్ కళాశాలలకు సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.దేశంలో తొలిసారిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీ అని.. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి బకాయిలు లేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇస్తున్నట్టు చెప్పుకొచ్చారు. ఇక బకాయిలను కూడా వన్ టైం సెటిల్మెంట్ చేసేలా.. మంత్రి శ్రీధర్ బాబుకు బాధ్యతలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ విషయంపై ఆర్థిక శాఖతో మాట్లాడి.. ఓ కొలిక్కి తీసుకొచ్చేలా చూడాలని శ్రీధర్ బాబుకు విన్నవించారు.ఇక అభివృద్ధి చెందుతున్న దేశానికి సివిల్ ఇంజినీరింగ్ అత్యంత అవసరం. కొన్ని కళాశాలల్లో ఆ కోర్సు లేకుండా చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. కళాశాలల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులను కచ్చితంగా నడపాలి. ఈ కోర్సులు లేకుంటే దేశం ప్రమాదాన్ని ఎదుర్కొంటుంది.విద్యా సంస్థలు పట్టాలు చేతిలో పెట్టి నిరుద్యోగులను తయారు చేసే కర్మాగారాలుగా మారడం తమ ప్రభుత్వానికి ఏమాత్రం సమర్థనీయం కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నైపుణ్యం కలిగిన నిష్ణాతులుగా తీర్చిదిద్దడంలో కాలేజీలు ప్రపంచ అవసరాలకు తగినట్టుగా సరికొత్త ప్రణాళికలు తయారు చేయాలని కోరారు. అందుకు తమ ప్రభుత్వం పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.ఫార్మా, ఐటీ తర్వాత ఏఐ ప్రపంచానికి నడిపించబోతోందని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని అన్ని కాలేజీల్లో ఏఐకి సంబంధించిన కోర్సును ప్రవేశపెట్టాలని%ా% ఇందుకు ప్రభుత్వం కూడా ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. పొరుగు రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంతో పోటీపడేలా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మా ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం తెలిపారు.ఇంజనీరింగ్ విద్యను మరింత పటిష్టం చేసి, ఉన్నత నాణ్యతా ప్రమాణాల స్థాయికి తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. ఆ దిశగా అడుగులు వేస్తూ ప్రాథమిక స్థాయిలో 65 ఐటీఐ కాలేజీలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్న విషయాన్ని వివరించారు.తెలంగాణ ఆకాంక్షకు ప్రధాన కారణమైన నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం కంకణబద్ధమై ఉందని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్ ప్రకటించి దానికి చట్టబద్ధత కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోర్టు చిక్కులు, ఇతర గందరగోళాలను పరిష్కరించి ఇప్పటిదాకా 30వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామన్నారు.టీజీఎస్‌పీఎస్సీ పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపడతోందని.. ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే ఉద్యోగాల భర్తీ ఉంటుందని స్పష్టం చేశారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగాల భర్తీ, డీఎస్సీ ద్వారా టీచర్ల భర్తీ ప్రక్రియలోనూ నిబంధనల ప్రకారం, కోర్టు చిక్కులు తలెత్తకుండా, నిరుద్యోగులకు న్యాయం జరిగేలా స్పష్టమైన విధానంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, విద్యాశాఖ కార్యదర్శి, జెన్‌టీయూ ఇంచార్జి వైస్ ఛాన్సలర్ బుర్రా వెంకటేశం, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

## 8 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించాం..

### ముంబై సభలో మోదీ

**టీ మీడియా, జులై 13,ముంబై:**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం (13 జూలై) ముంబై పర్యటన సందర్భంగా రూ. 3 వేల కోట్ల విలువైన ప్రాజెక్ట్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా దేశంలో ఉద్యోగాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. పనిలో పనిగా విపక్షాలను ప్రధాని మోదీ తీవ్రంగా విమర్శించారు. ఉద్యోగాలకు సంబంధించి ఇటీవల ఆర్‌బీఐ ఒక నివేదిక విడుదల చేసింది. గత 3-4 సంవత్సరాలలో దేశంలో సుమారు 8 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ గణాంకాలు అసత్య ప్రచారం చేసే వారి నోరు మూయించాయన్నారు ప్రధాని మోదీ. పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, దేశ అభివృద్ధిని ప్రతిపక్షాలు వ్యతిరేకించాయన్న ప్రధాని, తాజా నివేదికలు ప్రభుత్వ పనితీరు స్పష్టమవుతుందన్నారు. బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడమే ఎన్‌డీఏ ప్రభుత్వ అభివృద్ధి నమూనా అన్నారు. దశాబ్దాలుగా అట్టడగున ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తున్నామని, కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసిన వెంటనే శాశ్వత హోదా కల్పించామని ప్రధాని మోదీ అన్నారు. ఇళ్లు లేనివారికి, రైతులకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకున్నామని ప్రధాని మోదీ వెల్లడించారు.మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం అదే నిబద్ధతతో పనిచేస్తోందన్నారు మోదీ. మహారాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం 10 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణను అందించాలని నిర్ణయించినందుకు సంతోషిస్తున్నాను. పర్యాటకం, వ్యవసాయం, పరిశ్రమలు మంచి కనెక్టివిటీ ఉన్నట్లయితే, అది పేదలకు, మహిళా శక్తికి, యువశక్తికి భద్రత, సౌలభ్యం, గౌరవాన్ని ఇస్తుందన్నారు మోదీ. ముంబైలోని ప్రజల జీవితాలను మెరుగుపరచడమే మా లక్ష్యం అన్న ప్రధాని, ముంబై చుట్టూ కనెక్టివిటీ మెరుగుపడుతోందన్నారు. ముంబైలో కోస్టల్ రోడ్ అటల్ సేతు పనులు పూర్తయ్యాయన్నారు. అటల్ సేతు గురించి తప్పుడు ప్రచారం చేయడంపై ప్రతిపక్షాల తీరుపై ప్రధాని మోదీ మండిపడ్డారు.

## కేజ్రీవాల్ కోమాలోకి వెళ్లే ప్రమాదం!

**టి మీడియా, జూలై 13, హైదరాబాద్ :**



మద్యం పాలసీ కేసులో తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 8.5 కిలోలు తగ్గారని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సంజయ్ సింగ్ ఆరోపించారు. జైల్లో ఉండగా ఐదుసార్లు ఆయన బ్లడ్ షుగర్ పడిపోయిందన్నారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ%ా% కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కేజ్రీవాల్‌ను జైల్లో తీవ్రంగా వేధించేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఇది అత్యంత ఆందోళనకరమైన అంశమన్నారు. మద్యం పాలసీ కేసులో ఈడీ, సీబీఐ అరెస్ట్ చేసిన తర్వాత ఏప్రిల్ 1 నుండి కేజ్రీవాల్ తీహార్ జైలులో ఉన్నారు. మార్చి 21న ఈడీ అరెస్ట్ చేసిన సమయంలో కేజ్రీవాల్ 70 కిలోలు ఉన్నారని, ఇప్పుడు ఆయన బరువు 61.5 కిలోలకు తగ్గిందని తెలిపారు. జైల్లో కేజ్రీవాల్‌ను చిత్రహింసలు పెట్టడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. ఆయన జీవితంతో ఆడుకోవడమే మోదీ లక్ష్యమని మండిపడ్డారు. కేజ్రీవాల్‌కు ఎలాంటి పరీక్షలు నిర్వహించకపోవడంతో బరువు ఎందుకు తగ్గుతున్నారో కారణం తెలియడం లేదన్నారు. బరువు తగ్గడం తీవ్రమైన అనారోగ్యానికి సంకేతమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బరువు తగ్గడమే కాకుండా ఐదుసార్లు షుగర్ లెవల్స్ పడిపోయాయన్నారు. ప్రతిసారి షుగర్ లెవల్స్ పడిపోతున్నాయంటే కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు.




## ప్రభుత్వ ఆసుపత్రిలో... ప్రవేట్ ల్యాబ్ టెక్నిషియన్లు..

- పోలీసులకు అప్పగించిన సూపరింటెండెంట్

**టి మీడియా, జూలై 13,గుంటూరు :**



అది ప్రభుత్వ వైద్య శాల.. ఉమ్మడి గుంటూరు జిల్లాకే కాదు మరో నాలుగు జిల్లాల రోగులకు అతి పెద్ద ఆసుపత్రి అది. రోజు పదివేల మంది వస్తూ పోతూ ఉండే వైద్యశాలలో ప్రవేటు వ్యక్తుల దోపిడి పెరిగిపోయింది. దీంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ అర్ధరాత్రి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో తనకు తారసపడిన వారిని పోలీసులుకు పట్టించారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో ఈసిజి విభాగంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, రాత్రి వేళలో వైద్యులు టెక్నిషియన్లు అందుబాటులో ఉండటంలేదన్న ఆరోపణలు వచ్చాయి. ఆరోపణలు రావడమే కాదు ఏకంగా సూపరింటిండెంట్ కిరణ్ కుమార్ కు కొంతమంది రోగులు ఫిర్యాదు చేశారు. దీంతో రాత్రి పన్నెండు గంటల తర్వాత సూపరింటిండెంట్ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.అర్ధరాత్రి సమయంలో ఆసుపత్రికి వచ్చిన సూపరింటిండెంట్ అనేక అవకతవకలు కనిపించాయి. ఈసిజి విభాగంలో గత ఆరు నెలల నుండి రాత్రి సమయంలో ఒక్కరే ఉంటున్నారని గుర్తించారు. నిబంధనల ప్రకారం ఇద్దరూ అక్కడ పనిచేయాల్సి ఉంది. ఈసిజి రీల్స్ ను గవర్నమెంట్ ఆసుపత్రి నుండి తీసుకెళ్లి బయట విక్రయిస్తున్నట్లు ఆయన పరిశీలనలో తేలింది. హాస్పిటల్ లో సూపరింటిండెంట్ పరిశీలిస్తున్న సమయంలో ల్యాబ్ టెక్నిషియన్ల ఆగడాలు పెచ్చుమీరినట్లు పలువురు రోగులు ఆయన ద్రుష్టికి తీసుకొచ్చారు. ప్రవేటు ల్యాబ్స్ నుండి వస్తున్న టెక్నిషియన్లు ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు.అదే సమయంలో ప్రవేటు ల్యాబ్ టెక్నిషియన్లు బ్లడ్ శాంపిల్స్ కలెక్ట్ చేసుకొని వెలుతూ సూపరింటిండెంట్ కు కనిపించారు. దీంతో వెంటనే ఆయన వారిని ప్రశ్నించి బయట వ్యక్తులు ఎలా ఆసుపత్రిలోకి వస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు అతన్ని అవుట్ పోస్ట్ పోలీసులకు అప్పగించారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై రోగులు సంత్రుప్తి వ్యక్తం చేశారు. ఇలా రెండు గంటల పాటు సూపరింటిండెంట్ ఆసుపత్రి మొత్తాన్ని చుట్టేశారు. దీంతో సిబ్బందితో పాటు వైద్యుల్లోనూ కదలిక వచ్చింది. ప్రతి రోజూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే బాగుంటుందని రోగులు చెప్పుకుంటున్నారు.

# లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలను పెంచేందుకు కేంద్రం యత్నం

- చట్టంలో నియమాలను సవరించిన హోంమంత్రిత్వశాఖ

**టి మీడియా, జులై 13,న్యూఢిల్లీ :**
జమ్మూ- కాశ్మీర్ త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం లెఫ్టినెట్ గవర్నర్ అధికారాల్ని పెంచేలా చర్యలు చేపట్టింది. జమ్మూ %-% కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2019 నియమాలను కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ సవరించింది. ఈ సవరింపు వల్ల లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలు మరింత పెరుగుతాయి. జమ్మూ అండ్ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2019లో అధికారాలను అమలు చేసే సెక్షన్ 55 నిబంధనలో సవరణలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో జులై 12న గెజిట్లో పేర్కొనడంతో ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఈ మేరకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంహెచ్) నోటిఫికేషన్ పేర్కొంది.

కాగా, జమ్మూ కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వ యొక్క వ్యాపార లావాదేవీలను సవరించడానికి రాష్ట్రపతి మరిన్ని నిబంధనలను రూపొందించినట్లు ఈ నోటిఫికేషన్ పేర్కొంది. తాజాగా సవరించిన చట్టాన్ని జమ్మూ అండ్ కాశ్మీర్ (రెండవ సవరణ)- నియమాలు 2024 అని పిలవాలని ఎంహెచ్ నోటిఫికేషన్ తెలిపింది. ఈ సవరించిన నిబంధనల ద్వారా శాంతి భద్రతల చర్యలకు సంబంధించి పూర్తి అధికారాలు లెఫ్టినెంట్ గవర్నర్ చేతుల్లోనే ఉంటాయి. అంతకుముందు పోలీసు, పబ్లిక్ ఆర్డర్, ఆల్ ఇండియా సర్వీస్, అవినీతి నిరోధక బ్యూరోకు సంబంధించి విచక్షణను అమలు చేయడానికి ఆర్థిక శాఖ సమ్మతి అవసరం ఉండేది. కానీ కొత్తగా సవరించిన చట్ట నియమాల్లో చొప్పించిన సబ్ రూల్ (2ఎ) ప్రకారం.. ఆర్థికశాఖ సమ్మతి అవసరం లేదు. పోలీసు, యాంటీ కరప్షన్ బ్యూరో, ఆల్ ఇండియా సర్వీసులకు సంబంధించిన ప్రతిపానదలను ప్రధాన కార్యదర్శి లెఫ్టినెంట్ గవర్నర్ ముందు ఉంచితే.. ఆయన ఆ ప్రతిపాదనలను అంగీకరిస్తారు లేదా వాటిని తిరస్కరించే అవకాశం ఉంది. చట్టంలోని ప్రధాన నియమాల్లో 42 తర్వాత.. కొత్తగా 42(ఎ)ను హోం మంత్రిత్వశాఖ చేర్చింది. ఈ నిబంధన ప్రకారం.. ముఖ్యమంత్రికి న్యాయ వ్యవహారాల్లో ఎలాంటి అధికారం ఉండదు. అడ్వకేట్ జనరల్‌తోపాటు ఇతర న్యాయ అధికారుల నియమకానికి ప్రధాన కార్యదర్శితోపాటు ముఖ్యమంత్రి లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం కోసం పంపాలి. ఇక 42బి నియమం ప్రకారం.. ప్రాసిక్యూషన్ మంజూరు లేదా అప్పీల్‌కు దాఖలకు సంబంధించిన ఏదైనా ప్రతిపాదనను న్యాయశాఖ, జస్టిస్ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ద్వారా ప్రధాన కార్యదర్శి లెఫ్టినెంట్ గవర్నర్ ముందు ఉంచుతారు. 43 నిబంధన కూడా జైళ్లు, డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి సంబంధించిన విషయాలపై కొన్ని నిబంధనలు చేర్చడం జరుగుతుందని ఎంహెచ్ఎ నోటిఫికేషన్ పేర్కొంది. అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, ఆల్ ఇండియా సర్వీసెస్ ఆఫీసర్ క్యాడర్ పోస్టుల పోస్టింగ్ బదీలలకి సంబంధించిన విషయాలకు సంబంధించి లెఫ్టినెంట్ గవర్నర్‌కు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రధాన కార్యదర్శి ద్వారా ప్రతిపాదనను పంపాలి.




## ఉమెన్స్ హాస్టల్‌లో ఊడిపడిన స్లాబ్

**టి మీడియా, జూలై 13,వరంగల్:**
వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయ (%ఖఖ%) హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్ ఊడిపడిన విషయం మరువక ముందే మరో ఘటన చోటుచేసుకున్నది. వర్సిటీలోని పోతన ఉమెన్స్ హాస్టల్‌లోని ఓ గదిలో అర్ధరాత్రి వేల స్లాబ్ కుప్పకూలింది. అయితే ఆ సమయంలో గదిలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే ఈ ఘటపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. హాస్టల్‌లో ఉండాలంటే ప్రాణాలమీదికి వస్తున్నదని, ఎన్నిసార్లు వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోతున్నదని చెప్పారు. హాస్టల్ వార్డెన్‌ను నిలదీశారు. పైకప్పు ఊడిన ఘటనపై విద్యార్థులు ఆందోళనకు దిగారు. రాణిరుద్రమదేవి హాస్టల్‌ను పరిశీలించడానికి వచ్చిన రిజిస్ట్రార్ మల్లారెడ్డిని నిలదిశారు. హాస్టళ్లను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయనతో వాగ్వాదానికి దిగారు. రిజిస్ట్రార్ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కాగా, గత నెల 29న వర్సిటీ క్యాంపస్‌లోని ఉమెన్స్ హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్ ఊడిపడటంతో పీజీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న లూనావత్ సంధ్య అనే విద్యార్థిని తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఫ్యాన్ మీదపడంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. తోటి విద్యార్థులు వెంటనే ఆమెను దవాఖానకు తరలించారు.



# ఘోర రోడ్డు ప్రమాదం..

- తీర్థయాత్రకు వెళ్ళిన పాతబస్తీవాసుల దుర్మరణం

**టి మీడియా, జూలై 13,ఒరిస్సా :**
ఒరిస్సాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు దర్మరణం పాలయ్యారు. పాతబస్తీ నుంచి ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులో తీర్థయాత్రకు వెళ్లి అనంత లోకాలకు పయనమయ్యారు. శనివారం తెల్లవారుజామున ఆగి ఉన్న ట్రక్కును ట్రావెల్ బస్సు వేగంగా ఢీ కొట్టింది. దీంతో డ్రైవర్ ఉదయ్ సింగ్ తోపాటు మరో ఇద్దరు మృతి చెందారు. ఈ విషాద ఘటన బెత్నోనటి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మరో 20మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను బెత్నోనటి మెడికల్ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్ పాతబస్తీ ఉప్పుగూడ కు చెందిన ఉదయ్ సింగ్ ఠాకూర్ (53) వృత్తిరీత్యా డ్రైవర్, ట్రావెల్ ఏజెంట్. ఉదయ్ సింగ్ తీర్థ యాత్ర ట్రిప్‌లు తీస్తుంటాడు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ పాతబస్తీ ఉప్పుగూడతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన మరో 23 మందితో కలిసి నార్త్ ఇండియా టూర్‌కి ప్లాన్ చేశాడు. ఇందులో భాగంగానే 12 రోజుల నుంచి 15 రోజుల పాటు జరిగే యాత్రలో ఉప్పుగూడ శివాజీ నగర్ కు చెందిన నిత్యశ్రీ ట్రావెల్స్‌కు చెందిన 22 సీటర్ ఎస్ఎంఎల్ బస్సు డ్రైవర్ మల్లేష్ అనే వ్యక్తి తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. జూలై 8 వ తేదీన పాతబస్తీ ఉప్పుగూడ నుంచి ఉదయ్ సింగ్ అతని భార్య విజయ, కూతురు స్రవంతి, కుమారుడు వినీత్ లతోపాటు మరో 19 మందితో కలిసి నార్త్ ట్రిప్ కు బయలు దేరారు. తెలంగాణ రాష్ట్రం మీదుగా ఆంధ్రప్రదేశ్ దిశగా మధ్యలో ఉన్న పుణ్య క్షేత్రాలను చూసుకుంటూ ఈ నెల 12 వ తేదీన పూరి జగన్నాథ్ దేవాలయంకు చేరుకున్నారు. ఒరిస్సా లోని బాలాపూర్ మీదుగా బీహార్ కు వెళ్తున్న క్రమంలో మయూరభంజ్ జిల్లా బెత్నోనటి పోలీస్ స్టేషన్ పరిధిలో బుడి కమర్ చక్ ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న ట్రక్ ను బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఉదయ్ సింగ్ తోపాటు ఒకే కుటుంబానికి చెందిన అన్న ఉప్పలయ్య (70), చెల్లెలు క్రాంతి భాయ్ (62) అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ మల్లేష్ కు కాలు విరగడంతోపాటు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో 20 మందికి కూడా తీవ్ర గాయాలు అయినట్లు క్షతగాత్రుల బంధువులు తెలిపారు. గాయపడిన వారిని బెత్నోనటి మెడికల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





## చిరుతను బంధించేందుకు ప్రణాళికలు సిద్ధం..

**టీ మీడియా, జూలై 13, మహానంది:**
మహానంది పుణ్యక్షేత్రంలోని పరిసరాల్లో గత కొన్ని రోజులుగా చిరుతపులి సంచారం భయభ్రాంతులకు గురిచేస్తుంది. శనివారం వైల్డ్ లైఫ్ ప్రిన్సిపల్ చీఫ్ వార్డెన్ అజయ్ కుమార్ నాయక్, అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా, మహానంది దేవస్థానం వెనుక వైపు వున్న గోశాల సమీపంలో చిరుత సంచరించిన ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. త్వరలో చిరుత పులిని బోనులో బంధించి, అడవిలో దూర ప్రాంతంలో వదిలేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ అధికారులతో చిరుత పులి సంచారం పై పలు విషయాలను చర్చించారు. ఆలయ అధికారులు ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని, ఆలయం చుట్టూ ఆలయ పరిధిలో గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేసుకోవాలని, చిరుత పులి బంధించే వరకు ఆలయ అధికారులు, భక్తులను గ్రామస్తులను ప్రమత్తంగా ఉంచాలని అన్నారు. అటవీశాఖ అధికారులకు చిరుత సంచారం గూర్చి సూచనలు ఇచ్చారు .ఈ కార్యక్రమంలో మహానంది ఆలయ ఏఈఓ ఓ.వెంకటేశ్వర్లు, డిఆర్ఓ హైమావతి, ఎఫ్ బి ఓ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి ఎమ్మెల్యే లక్ష్యం

- మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్

**టీ మీడియా,జులై 13,పెద్దపల్లి బ్యూరో :**
కాల్వశ్రీరాంపూర్ గ్రామాల అభివృద్ధి ఎమ్మెల్యే విజయ రమణారావు లక్ష్యం అని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ అన్నారు. కాల్వ శ్రీరాంపూర్ పోత్కపల్లి రహదారి కి నిధులు మంజూరైన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సీట్లు పంచుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో హుస్సేన్ మియ వాగు వెళ్లే రహదారి మరమ్మతులను మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్‌లి కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సారయ్య గౌడ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కాల్వ శ్రీరాంపూర్ నుంచి ఓదెల మండలం పొత్కపెల్లి రహదారి అధ్వానంగా తయారైన విషయంపై ఎమ్మెల్యే స్పందించి డబుల్ రోడ్డు నిర్మాణమునకు సిఆర్ఎఫ్ నిధుల నుంచి 25 కోట్లు మంజూరు చేశారని అదేవిధంగా కాల్వ శ్రీరాంపూర్ లో నల్లల బాయి నుంచి హుస్సేన్ మియా వాగు పోయే రైతుల రహదారి కి మరమ్మతులకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారు అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనతి కాలంలోనే గ్రామ గ్రామాన సిసి రోడ్లు వేయడం జరిగింది అన్నారు. మండల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకొస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేణ సదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రకరణ్ రెడ్డి ,నాయకులు బంగారు రమేష్, అల్లం దేవేందర్, సబ్బని రాజమల్లు, గోలి సుధాకర్, శివరామకృష్ణ, మాదాసు సతీష్, పోశాల సదానందం , అటికం శంకర్ గౌడ్, ఎంపీటీసీ రావి సదానందం, గాజుల మోహన్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం

**టీ మీడియా, జులై 13,ఎండపల్లి:**
మండలం గుల్లకోట గ్రామంలో శనివారం జగిత్యాల జిల్లా ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ సుపరిండెంట్ ఆదేశాల మేరకు ధర్మపురి ఎక్సైజ్ స్టేషన్ అధికారుల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన 75వ, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ అధికారులు గుల్లకోట గ్రామంలో గౌడ సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి సత్యం గౌడ్ అధ్యక్షణ ముందు తరాల ఉపాధి కొరకు ఈత చెట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మహేంద్ర సింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మొక్కలు పెంచడం మానవాళికి ఎంతో మనుగడగా తొడ్పాడుతుందని ప్రాణ కోటికి జీవన ధారంగా ఉంటుందని మంచి గాలిని అందిస్తూ వర్షాన్ని కుర్పిస్తూ వ్యవసాయ దారులకు పంటలకు మేలు జరుగుతుందని కనుక ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిబ్బంది గంగాధర్,జలపతి, దుర్గాప్రసాద్,రజిత,గుల్లకోట గౌడ సంఘం అధ్యక్షులు గొల్లపల్లి సత్యం ఉపాధ్యక్షులు అంజయ్య, సభ్యులు గొల్లపల్లి శంకరయ్య ,బుర్ర శ్రీను ,పాకాల అశోక్, గొల్లపెల్లి అంజి గౌడ్ గొల్లపల్లి నరేష్, బీసకోని గంగన్న తదితరులు పాల్గొన్నారు.



## నేడు మహానందిలో ఆలయ శుద్ధి కార్యక్రమం

**టీ మీడియా, జూలై 13, మహానంది:**
మహానంది పుణ్యక్షేత్రంలో ఆదివారం ఆలయ శుద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ వేద పండితులు రవిశంకర అవధాని శనివారం తెలిపారు. ఆలయ కార్యనిర్వహ ణాధికారి నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 200మంది సేవకులు పాల్గొంటారని చెప్పారు. ముందుగా గణపతి పూజ,పుణ్యాహావాచనం పూజల అనంతరం వివిధ మూలికా,సుగంధ ద్రవ్యాలతో గర్భాలయం, అంతరాలయం ప్రాకారాలు, గోపురాలు,స్తంభాలు, మండపాలు ఇలా ప్రతి భాగాన్ని, శాస్త్రబద్ధంగా శుద్ధి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు కుడా స్వచ్ఛందంగా పాల్గొనవచ్చు అని పేర్కొన్నారు.



## ప్రకృతిని కాపాడుకునే బాధ్యత అందరిదీ


**టీ మీడియా, జులై 13, వనపర్తి బ్యూరో :**
జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా జాతీయ పార్టీ పిలుపు మేరకు వనపర్తి పట్టణంలోని 25 వార్డులో నాయకులు పట్టణ ప్రధాన కార్యదర్శి రాయన్న సాగర్, ఆధ్వరంలో మొక్కలు నాటడం జరిగింది. వనపర్తి పట్టణ అధ్యక్షులు బచ్చురామ్ అధ్యక్షతన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ అడవులు తరిగిపోతున్నాయని దీనివల్ల వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరుగుతూ వర్షపాతం తగ్గుతున్న పక్షంలో మానవ జీవితమే అల్లకల్లోలం అయ్యే పరిస్థితి ఏర్పడే ప్రమాదం రాకుండా ఉండాలంటే ప్రకృతిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని ఉంది అని ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి అని కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఓబీసి మోర్చా రాష్ట్ర నాయకులు శ్రీశైలం ప్రతి ఇంటికి చెట్లు ఇవ్వడం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షులు కుమారస్వామి, రామన్న గారి వెంకటేశ్వర రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సుమిత్రమ్మ,ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శామ్యూల్, పట్టణ నాయకులు చిలుక లక్ష్మీనారాయణ , కడమంచి శివ, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ విజయ్ కుమార్ సాగర్, కార్యకర్తలు కాలనీవాసులు చంద్రుడు, జమున, అలివేలమ్మ, ఆనంద్ కుమార్, విజయ,నాగమణి మరియు ఇతరులు కాలనీలో మొక్కలు నాటడం జరిగింది. వార్డ్ ప్రజలందరికీ పర్యావరణం పై అవగాహన కల్పించడం జరిగింది.



## రైతు భరోసా ఇవ్వలేకే అభిప్రాయ సేకరణల

- రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ
- బిఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, రమేష్ గౌడ్

**టీ మీడియా, జులై 13, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పట్టణ కార్యాలయంలో శనివారం బిఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు గట్టు యాదవ్,జిల్లా పార్టీ నాయకులు వాకిటి శ్రీధర్, రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినప్పుడు గుర్తు రాలేదా అభిప్రాయ సేకరణ డిసెంబర్ 12 అధికారంలోకి రాగానే వాళ్లు ఇచ్చేది 10000/- మేము ఇచ్చేది 15000 /- తుపాకీ రాముడు రేవంత్ రెడ్డి మాట్లాడింది నిజం కాదా ? రాష్ట్రంలో 71 వేల రైతు కుటుంబాలు ఉన్నావని అందులో గత ప్రభుత్వం 69 వేల రైతు కుటుంబాలకు రైతుబంధు ఇచ్చిన సంగతి మీకు గుర్తు లేదా? ఐదు ఎకరాల లోపు రైతులే 92 శాతం భూమి కలిగి ఉన్నారు. 6% 10 ఎకరాల నుంచి 20 30 ఎకరాల భూస్వాములున్నారు ఉన్నారు. 2/% శాతం జాకీర్దారులు జమీందారులు 100 ఎకరాలపై ఉన్న వాళ్ళ ఉన్నారు .8 శాతం ఉన్న ధనికుల కోసం 92 శాతం ఉన్న పేద రైతుల పొట్ట కొట్టడం న్యాయమా ? కాలయాపనలు కట్టి పెట్టి వెంటనే రైతులకు పెంచిన రైతు భరోసా ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. రైతుల అభిప్రాయ సేకరణ కలెక్టరేట్లో పెట్టి రైతులు కాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలను పిలిచి కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ నీ తలపించే విధంగా అభిప్రాయ సేకరణ చేసినారు. పండించే రైతులు కలెక్టరేట్ కి అర్థ కిలోమీటర్ దూరం పోలీస్ నిర్బంధంలో పెట్టి అభిప్రాయ సేకరణలో కాంగ్రెస్ కార్యకర్తలే రైతులయ్యారు వాళ్ల అభిప్రాయాన్ని రైతుల అభిప్రాయంగా సబ్ కమిటీ స్వీకరించింది. ప్రతి పక్షాలను నిర్బంధించి అరెస్టు చేయడం ప్రజాస్వామ్యమా? ఇది ప్రజా పాలన నియంతల పాలన ? రాష్ట్రంలో ఎంత మంది రైతులు రైతులు ఉన్నారు. రాష్ట్రంలో సాగు భూమి ఎంత ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో ,మాజీ కౌన్సిలర్ నాగన్న యాదవ్, స్టార్ రైమ్ కంచ రవి , యుగంధర్ రెడ్డి ,చిట్యాల రాము మన్యం నందిమల్ల రాము కడుకుంట్ల వెంకటేష్ , తోట శ్రీను , వజ్రాల రమేష్ పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


**టీ మీడియా జులై 13,వెల్గటూర్:**
ఎండపల్లి ఉమ్మడి మండలాల్లో,సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డి ఎం హెచ్ ఓ శ్రీనివాస్ రావు తెలిపారు. ఎండపల్లి ఉమ్మడి మండలాల్లో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ శ్రీనివాస్ రావు, డాక్టర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణ సీజనల్ వచ్చే వ్యాధుల నివారణ కోసం సర్వే నిర్వహించారు. ఈనెల 10వ తేదీన అనుమానిత జ్వరం కేసుల వైద్య పరీక్షలు నిర్వహించగా వెల్గటూర్ మండలంలో ఒక డెంగ్యూ కేసు, అంబారిపేట పి హెచ్ ఆధ్వర్యంలో డెంగ్యూ పాజిటివ్ కేసు ఒకటి, పాతగూడూర్ లో ఒకటి డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదయింది. రాపిడ్ టేస్ట్ టీం లో భాగంగా రెండు కేసులకి హౌస్ స్ప్రే ఇంటిలోపల స్ప్రే నిర్వహించారు. అంబారిపేట న్యూ పి హెచ్ ఆధ్వర్యంలో ఎండపల్లి గ్రామంలో అనుమానిత వ్యక్తుల నుండి ఐదుగురి రక్త నాములనాలు సేకరించి టెస్టులకు పంపించారు. అదేవిధంగా 61 ఇండ్లల్లో ఫైరాత్రిమ్ స్ప్రే చేయించారు . వెల్గటూర్ పరిధిలోని పాతగూడూర్ సబ్ సెంటర్లో నలుగురు వ్యక్తుల అనుమానితుల రక్తనమూనాలు పంపించారు. ఆదే విధంగా52 ఇండ్లల్లో ఫైరవిత స్ప్రే చేయించారు . ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ ఓ మాట్లాడుతూ డెంగ్యూ కేసుల నిర్ధారణ కోసం ఒళ్ళు నొప్పులు వచ్చిన అనుమానించి దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, మండల వైద్య అదికారి డాక్టర్ శ్రావణ్ కుమార్, ఎం పి ఓ జక్కుల శ్రీనివాస్, హెల్త్ సుపర్ వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ జాతీయ కిటక నిర్ములన కార్యక్రమం నోడల్ పర్సన్ ప్రసన్న కుమార్, ఎం ఎల్ హెచ్ పి లు, అంబారిపేట న్యూ పి హెచ్ హెల్తూ సుపర్ వైజర్ రమణ వల్లి హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ పైరిత్యం స్ప్రే సిబ్బంది పాల్గొన్నారు.



## అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

- డిపో మేనేజర్ తో చర్చించిన జిల్లెల చిన్నారెడ్డి

**టీ మీడియా, జులై 13, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వనపర్తి డిపో మేనేజర్ వి.వేణుగోపాల్ తో కొత్త బస్సులు, రవాణా సౌకర్యాలు లేని గ్రామాల గురించి చర్చించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి .వనపర్తి నియోజకవర్గం లోని అన్ని మండలాల్లో బస్సు సౌకర్యం లేని గ్రామాలకు, కొత్తగా 40 రూట్లకు, 15 కొత్త బస్సులు మరియు అదనంగా సిబ్బందిని కేటాయించాలని కోరడం జరిగింది. వనపర్తి బస్టాండ్లో అమ్మ క్యాంటీన్ మోడల్ ప్రాజెక్ట్ గా ఏర్పాటు చేయాలి అని కోరారు. వనపర్తి బస్టాండ్ ఆవరణలో గార్డెనింగ్ ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. అదేవిధంగా బస్టాండ్ ఆవరణలో శుభ్రతను పాటించాలని , సిబ్బందిని అదనంగా నియమించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, మండల అధ్యక్షులు నారాయణ,పెంటన్న,రాములు యాదవ్, నాయకులు దివాకర్,రోహిత్,లలితమ్మ,ప్రవీణ్ రెడ్డి,పాండురావు,ఆవుల చంద్రశేఖర్, గడ్డం వినోద్, ఆనంద్ సాగర్,చరణ్ ఆర్టీసీ సిబ్బంది కృష్ణ శ్రీను, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## వివాహ వేడుకల్లో పాల్గొన్న జిల్లెల చిన్నారెడ్డి

**టీ మీడియా, జులై 13, వనపర్తి బ్యూరో :**
గోపాల్పేటలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొంకి వెంకటేష్ కుమార్తె వివాహ వేడుకలో వారి ఆహ్వానం మేరకు పాల్గొన్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కళకళలాడిన మహానంది క్షేత్రం

**టీ మీడియా, జూలై 13, మహానంది**
మహానంది క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీతో కళకళలాడింది. వరుసగా రెండు రోజులు సెలవు దినాలు కావడంతో, రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులే కాక, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన భక్తులు వేలాది సంఖ్యలో మహానందికి తరలివచ్చారు. తెల్లవారుజామునే భక్తులు కోనేరులలో పుణ్య స్నానాలు ఆచరించి, శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు. స్వామి అమ్మవార్ల దర్శనార్థం భక్తులు బారులు తీరారు. అనంతరం వినాయక, గరుడనంది, కోదండ రామాలయం ఆలయాలను సందర్శించారు. క్షేత్ర పరిసరాలు భక్తుల రద్దీతో కళకళలాడింది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు స్వామి అమ్మవార్ల దర్శనం నిర్విరామంగా కొనసాగింది. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు.






## స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ ను సన్మానించిన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్

**టీ మీడియా, జులై 13, వనపర్తి బ్యూరో :**
స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శివసేనారెడ్డిని గచ్చిబౌలి స్టేడియంలో వారి ఛాంబర్ లో ఘనంగా సన్మానించిన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్, శివకుమార్, నరేందర్ గౌడ్ , శివశంకర్ యాదవ్ . ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా ఎదుగుతూ గత ఐదు సంవత్సరాలలో తెలంగాణా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నో పోరాటాలు చేసి పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి వనపర్తి ఎమ్మెల్యే టికెట్ ను త్యజించి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ పదవి తో గౌరవం కల్పించినందుకు వనపర్తి జిల్లా తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నాము. రాబోవు కాలంలో వనపర్తికి ఇంకా కొన్ని పదవులు తెచ్చి వనపర్తి అభివృద్ధికి అందరూ సహకరించాలని సతీష్ యాదవ్ కోరారు.

## వనపర్తిని క్రీడాపర్తిగా మలిచేందుకు కృషి

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**టీ మీడియా, జులై 13, వనపర్తి బ్యూరో :**
తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి రాష్ట్రస్థాయిలో, ఎమ్మెల్యే తాను నియోజకవర్గంలో క్రీడలకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలను, సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఆయన హాజరై శివసేన రెడ్డి ని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసు నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తాను నిరంతరాయంగా కృషి చేస్తూ గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు చురుకైన పాత్ర పోషిస్తు నేడు తెలంగాణ రాష్ట్రంలోనే గౌరవప్రదమైన రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టడం ఎంతో గర్వకారమని ఆయన పేర్కొన్నారు.



# భాగ్యనగరంలో భారీ మోసం..

- రూ.24 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన జాగృతి కన్సల్టెన్సీ

**టీ మీడియా, జులై 13,హైదరాబాద్ :**

ఈ మధ్య కాలంలో నిరుద్యోగుల్ని టార్గెట్ చేసుకొని భారీ మోసాలకు పాల్పడుతున్నారు కొందరు కేటుగాళ్లు. ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేయడం.. ఆపై మనీ చేతికి అందగానే బోర్డు తిప్పేయడం కామన్ అయిపోయింది. సరిగ్గా ఇలాంటి మోసమే హైదరాబాద్‌లో మరొకటి వెలుగు చూసింది. ఉద్యోగాల ఆశ చూపి.. ఓ ఐటీ కన్సల్టెన్సీ రూ. 24కోట్లకు కుచ్చుటోపీ పెట్టడంతో లబోదిబోమంటున్నారు నిరుద్యోగులు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జాగృతి కన్సల్టెన్సీ నిరుద్యోగులను నిండా ముంచేసింది. ఉద్యోగాలు ఇస్తాం.. ఉద్యోగాలు ఇప్పిస్తాం.. అంటూ భారీ ఎత్తున ప్రచారం చేసిన జాగృతి కన్సల్టెన్సీ. నమ్మి వచ్చినవారిపై కుట్ర అమలు చేసింది. ఉద్యోగం ఊరికే రాదు.. 2 లక్షల రూపాయల డిపాజిట్ చేయాలని కండీషన్ పెట్టింది. ఐటీ కంపెనీలో ఉద్యోగమనే ఆశతో 1200 మంది నిరుద్యోగులు.. ఒక్కొక్కరు 2 లక్షల రూపాయలు కట్టారు. అయితే.. రూ. 2 లక్షలు కట్టినోళ్లకు ఫేక్ ఆఫర్ లెటర్స్‌తో ఉద్యోగాలు ఇచ్చింది.అట్టహాసంగా ఆఫీసు ఏర్పాటు చేసి ఉద్యోగాలు ఇచ్చిన కన్సల్టెన్సీ, జీతాలు మాత్రం ఇవ్వడం మానేసింది. అంతే.. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కంపెనీని నిలదీశారు ఉద్యోగులు. జీతాలు అయినా ఇవ్వండి లేకుంటే తాము కట్టిన 2 లక్షల రూపాయలు అయినా తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ, పరిస్థితులు చేయి దాటడంతో రాత్రికి రాత్రి బోర్డు తిప్పేసింది జాగృతి కన్సల్టెన్సీ. 1200 మంది నుంచి 24 కోట్ల రూపాయలు వసూలు చేసి జాగృతి కన్సల్టెన్సీ డైరెక్టర్ జగదీశ్ మోసం చేశారని బాధితులు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించడంతో భారీ మోసం వెలుగులోకి వచ్చింది.మరోవైపు.. ఉద్యోగాల పేరుతో మోసం చేయడమే కాక.. ప్రశ్నించినవారిని కేసుల్లో ఇరికించడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మాట్లాడుకుందామని ఇంటికి పిలిచిన వాకాటి రవిచంద్రారెడ్డి.. కిడ్నాప్ డ్రామా ఆడారని బాధితులు ఆరోపించారు. తప్పుడు కేసులు పెడుతున్న రవిచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు బాధితులు.




# షాద్‌నగర్ రియల్టర్ హత్య కేసులో ట్విస్ట్

- కొడుకే అసలు సూత్రధారి

**టి మీడియా, జూలై 13,రంగారెడ్డి :**



రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో సంచలనం సృష్టించిన రియల్టర్ కమ్మరి కృష్ణ హత్య కేసును పోలీసులు చేధించారు. ఆస్తి కోసం మొదటి భార్య కొడుకే హత్య చేయించినట్లుగా పోలీసులు నిర్ధారించారు. మూడో భార్యకు ఆస్తి మొత్తం రాసిస్తాడనే అనుమానంతోనే బాడీగార్డ్ బాబాకు సుపారీ ఇచ్చి హత్య చేయించినట్లు తేల్చారు. ఈ మేరకు కేసు వివరాలను శంషాబాద్ డీసీపీ రాజేశ్ మీడియా సమావేశంలో వెల్లడించారు.కమ్మరి కృష్ణ తన మొదటి భార్య, ఆమె పిల్లలను పట్టించుకోకుండా రెండో వివాహం చేసుకున్నాడు. ఆమె మరణించిన తర్వాత మూడో పెళ్లి చేసుకున్నాడు. మూడో భార్య పావనికి 16 నెలల కుమార్తె ఉంది. ఆమె పేరు మీద దాదాపు 16 కోట్ల విలువజేసే ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించాడు. దీనిపై కృష్ణతో మొదటి భార్య పెద్ద కొడుకు గొడవపెట్టుకున్నాడు. కృష్ణను ఇలాగే వదిలేస్తే ఆస్తి మొత్తాన్ని పావనికే రాసిచ్చేస్తాడని అతనిపై పగ పెంచుకున్నాడు. దీంతో ఎలాగైనా కృష్ణను చంపాలని ప్లాన్ చేశాడు. ఈ క్రమంలోనే కృష్ణ దగ్గర పనిచేసే బాడీగార్డ్ బాబాకు రూ.25 లక్షల నగదు, ఒక ఇల్లు ఇస్తానని ఆశచూపాడు.ఈ నెల 10వ తేదీన సాయంత్రం 5.30 గంటలకు జీలకర్ర గణేశ్ అలియాస్ లడ్డూ, ఇంకొక వ్యక్తితో కలిసి కమ్మదనం ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు. జీలకర్ర గణేశ్, మైనర్ బాలుడు ఇద్దరు కలిసి కమ్మరి కృష్ణ చేతులు వెనక్కి పట్టుకోగా.. బాబా తనతో పాటు తెచ్చుకున్న కత్తితో గొంతు కోసి, పొట్టలో పొడిచి పరారయ్యాడు. అతని అరుపులు విని పైఅంతస్తులో ఉన్న భార్య వచ్చి కృష్ణను శంషాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడు. పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరిపి నిందితులను పట్టుకున్నారు.



## టార్గెట్ చేసిన మోడీ గవర్నమెంట్

- కె.సి వేణుగోపాల్

**టీ మీడియా, జులై 13, న్యూఢిల్లీ :**

ఫోన్‌లో హానికరమైన స్పైవేర్‌తో తనని మోడీ గవర్నమెంట్ టార్గెట్ చేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ ఆరోపించారు. వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనకు మోడీ ప్రభుత్వం పాల్పడిందని, ఇలాంటి రాజ్యాంగ విరుద్ధమైన చర్యను తాము వ్యతిరేకిస్తున్నామని వేణుగోపాల్ అన్నారు.కాగా, కె.సి వేణుగోపాల్ దీనికి సంబంధించి ఎక్స్‌లో పోస్టు కూడా చేశారు. 'మీకు ఇష్టమైన హానికరమైన స్పైవేర్‌ను నా ఫోన్‌లో కూడా పంపినందుకు ధన్యవాదాలు ప్రధాని మోడీ జీ. మీ ఈ ప్రత్యేక బహుమతి గురించి నాకు తెలియజేయడానికి ఆపిల్ దయ చూపింది!. దీన్నిబట్టి మోడీ ప్రభుత్వం నేరపూరితంగా, రాజ్యాంగ విరుద్ధమైన రీతిలో వ్యవహరిస్తోందని తెలుస్తుంది. రాజకీయ ప్రత్యర్థులను అనుసరించడం.. వారి గోప్యతను ఆక్రమిస్తున్నారని స్పష్టమవుతుంది.' అని ఆయన తన ఎక్స్ పోస్టులో మోడీ ప్రభుత్వాన్ని విమర్శించారు. రాజ్యాంగంపైన దాడినైనా, బిజెపి ఫాసిస్టు ఎజెండాపైన ఇలా ఎటువంటి దాడినైనా ప్రజలు తిరస్కరిస్తారని లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తెలియజేశాయి అని ఆయన అన్నారు.వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనకు పాల్పడినట్లు యాపిల్ ఐ ఫోన్‌లో వచ్చిన మెసేజ్ స్క్రీన్‌సాట్‌ని కూడా వేణుగోపాల్ ఈ సందర్భంగా సోషల్‌మీడియాలో షేర్ చేశారు.

## విద్యార్థుల భవిష్యతుతో చెలగాటం

**టీ మీడియా, జులై 13, వనపర్తి బ్యూరో :**



నీట్-యుజిసి- 2024 ప్రవేశ పరీక్షపై ఎడతెగని చర్చలు పార్లమెంట్ మొదలుకొని సుప్రీంకోర్టు వరకు నడుస్తున్నాయి. ప్రవేశ పరీక్ష విధానం ఎవరి ఆధీనంలో ఉండగలదో వారే ఎలాంటి తప్పిదానికైన బాధ్యులు కాగలరనేది ప్రాథమిక అంశం. లీకేజీ మాల్ ప్రాక్టీస్ అనే ఆరోపణలు సమాజం దృష్టికి వచ్చినప్పుడు కేంద్ర ప్రభుత్వం తనంతన తాను స్పందిస్తూ 28 రాష్ట్రాలు 8 కేంద్రపాలిత ప్రాంతాల విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని సముచిత నిర్ణయాలు సకాలంలో తీసుకుంటే సరిపోయే దానికి సమస్యను సాగదీస్తూ లక్షలాది విద్యార్థుల బ ్ వి ష ్ య త ్ ం త ో చెలగాటమాడుతున్నది అని . గంధం నాగరాజు జిల్లా ఎస్సీ, ఎస్టీ కమిటి సభ్యులు, సూగూరు రాజ్ కుమార్ లోక్‌సత్తా జిల్లా కన్వీనర్ అన్నారు.పూటకోమాట, రోజుకో ప్రకటనతో దోబూచులాడుతున్నారు. అసలు మూలాన్ని కనుగొనకుండా గుడ్డిసాకులతో తిమింగలాలను వదిలి చిన్న చేపలను వేటాడటం సామాన్యుడిని సైతం అబ్బురపరుస్తున్నది. దేశంలో అత్యధిక ర్యాంకులు ఏ రాష్ట్రంలో వచ్చినాయి. ఏ రాష్ట్రంలో అక్రమాలు జరిగాయి అనే అంశాలను కనుగొని తప్పిదాలు జరిగిన సెంటర్లో మాత్రమే మళ్ళీ పరీక్ష (రీ ఎగ్జామ్) నిర్వహించి నీట్ ప్రధాన కన్వీనర్ సంబంధిత కేంద్రమంత్రులపై తగు చట్టపరమైన చర్యలు తీసుకుంటే సరిపోయేదానికి ఫాల్స్ ప్రెస్టిజ్తో నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు క్షణ క్షణం భయం కలిగిస్తున్నారు. పోటీ ప్రవేశపరీక్ష విధానం పట్ల విద్యార్థులకు విరక్తి కలిగిస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు, సంబంధిత న్యాయస్థానం ఈ అంశంపై యుద్ధ ప్రాతిపదికన అత్యవసర అంశముగా ఒక వారం షెడ్యూల్ తో తీర్పు వెల్లడించాల్సి ఆవశ్యకత ఎంతైనా కలదు.

## ఉత్తరాది రాష్ట్రాలను వణికిస్తున్న వరుణుడు

- తెలుగురాష్ట్రాలపై ప్రభావం ఇలా..

**టి మీడియా, జూలై 13,ఢిల్లీ:**



భారీ వర్షాలు ఉత్తరాదిలో జన జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. రుతుపవనాల ప్రభావంతో దేశంలోని పలు ప్రాంతాలను వర్షాలు వణికిస్తున్నాయి. అసోం, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ముంబై, హిమాచల్, ఢిల్లీ ప్రజలు ప్రయాణాలు, తాగునీరు వంటి అత్యవసరాల కోసం సైతం ఇబ్బంది పడుతున్నారు. రైల్వే, రోడ్డు రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. ఢిల్లీ, ముంబైను వర్ష భయం వీడటం లేదు. రెండు రోజుల నుంచి ముంబై నగర వాసులను భారీ వర్షాలు పట్టి పీడిస్తున్నాయి. నిన్న కురిసిన వర్షానికే నగరం మొత్తం స్తంభించిపోయింది. వర్షం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు. పంజాబ్ , హర్యానా, మధ్యప్రదేశ్ , మహారాష్ట్ర , గోవా , బిహార్ తదితర రాష్ట్రాల్లో రానున్న ఐదు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అలర్ట్ జారీ చేసింది.ఉత్తరాదిలో వరుణుడు గర్జిస్తున్నారు. పలు రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో భారీ వర్షాలతో జనజీవితం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలె జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఉత్తరాఖండ్‌లో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. వర్షం కారణంగా పలు పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులు ఇరుక్కుపోయారు. భారీ వర్షానికి ఉత్తరాఖండ్‌లోని వేల ఎకరాల్లో పంట పొలాలు నేలకొరిగాయి. హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. బీహార్‌లోని నదుల నీటిమట్టం పెరగడంతో 7 జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి.ఇదిలా ఉంటే తెలుగు రాష్ట్రాల్లో కూడా రుతుపవనాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఎడతెరిపిలేని వర్షాలు ఉభయగోదావరిజిల్లాలను అతలాకుతలం చేస్తోంది. ఎడతెరిపిలేని వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై గుంతల్లో వర్షపు నీరు చేరడంతో రాజమండ్రి మోరంపూడి దగ్గర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాజమండ్రి, రాజానగరం, గోకవరం, కోరుకొండ, రంపచోడవరం, చింతూరులో ఏకధాటిగా వర్షం కురుస్తోంది. మోరంపూడి జంక్షన్ వద్ద పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరడంతో వాహనదారులకు తీవ్ర అంతరాయం ఏర్పాడింది. తెలంగాణలో కూడా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ లో కూడా అక్కడక్కడా జల్లులు కురిశాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలంలో వర్షం దాటికి పర్ణశాల నీట మునిగింది. అక్కడకు భక్తులను అనుమతించడం లేదు ఆలయ అధికారులు. ఇలా దేశ వ్యాప్తంగా అనేక చోట్ల రుతుపవనాల ప్రభావం తీవ్రంగానే ఉంది. మరి కొన్ని రోజులు పరిస్థితి ఇలాగే కొనసాగే అవకాశం ఉందంటున్నారు వాతావరణ శాఖ అధికారులు.

## ఖాకీ వనంలో గంజాయి మొక్కలు..

- తవ్వేకొద్దీ వెలుగులోకి వస్తున్న వాస్తవాలు..!

**టి మీడియా, జూలై 13, మెదక్:**



జిల్లాలో పోలీస్ శాఖ అపఖ్యాతి మూటగట్టుకుంటోంది. వరుస ఘటనలతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. రక్షించాల్సిన రక్షకభట్లే, భక్షక భటులుగా మారుతున్నారు. ఖాక%ష% వనంలో గంజాయి మొక్కల్ల కొంతమంది పోలీసులు అవినీతి సొమ్ముకు అలవాటు పడి, ఏసీబీ అధికారులకు చిక్కుతున్నారు. గతంలో అరెస్టు అయినా.. ఆ ఎస్ఐ తీరు ఎందుకు మారలేదు..? ఇంతకీ జిల్లా పోలీస్ శాఖకు ఏమైంది..?మెదక్ జిల్లాలో వరుస ఘటనలతో పోలీస్ శాఖ పేరు మసక బారుతోంది. ఒక ఘటన మరవకు ముందే, మరో సంఘటన ఆ శాఖ పరువు తీస్తోంది. దీంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఆ శాఖ పెద్దలది. జూన్ నెల 28న అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు పోలీసులు. ఆ ట్రాక్టర్‌ను వదిలేందుకు ముప్పై వేల రూపాయలు డిమాండ్ చేశాడు మెదక్ జిల్లా హవేళిఘనపూర్ ఎస్ఐ ఆనంద్ గౌడ్. ఇరవై వేలు ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. అయితే ట్రాక్టర్ యజమాని గంగాధర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఆ డబ్బును మధ్యవర్తి మస్తాన్‌కు ఇవ్వాలని సూచించాడు ఎస్ఐ ఆనంద్‌గౌడ్. ఈ క్రమంలోనే డబ్బు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు ఏసీబీ అధికారులు.మార్చిలోనూ సేమ్ సీన్. మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారంటూ ఓ ట్రాక్టర్‌ను పట్టుకున్నారు మెదక్ రూరల్ పోలీసులు. దానిని వదిలేసేందుకు లంచం తీసుకుంటూ కానిస్టేబుల్ సురేందర్ ఏసీబీ అధికారులకు దొరికాడు. ఎస్ఐ అమర్ హస్తం ఉందని నిర్ధారించిన అధికారులు ఎస్ఐ అమర్‌తోపాటు కానిస్టేబుల్ బాసిత్‌ను కూడా సస్పెండ్ చేశారు ఉన్నతాధికారులు. మధ్యవర్తులను ఏర్పాటు చేసుకుని మరీ, వసూళ్లకు పాల్పడుతున్నారు అధికారులు. ఇలా వరుస ఘటనలతో పోలీసు శాఖ పేరు మసకబారుతోంది. ఇక ఇటీవలే ఏసీబీకి చిక్కిన హావేలి ఘనపూర్ ఎస్ఐ ఆనంద్‌గౌడ్ వ్యవహారశైలి ఆది నుండి వివాదస్పదమే. గతంలో నోట్ల రద్దు సమయంలోనూ ఏకంగా ఏ1 ముద్దాయిగా అరెస్టు అయ్యాడు..రెండు వేల పదహారు అక్టోబర్‌లో నోట్ల మార్పిడి ముఠా ఒకటి, మనోహరాబాద్‌లో తిష్టవేసి మోసాలకు పాల్పడింది. కోటి రూపాయల వరకూ చేతులు మారాయి. ఈ వ్యవహారంలో నిందితులకు అనుకూలంగా వ్యవహరించిన ఎస్ఐ ఆనంద్‌గౌడ్ బాధితులపై లాఠీఛార్జి చేశారన్న ఆరోపణలున్నాయి. ఈ కేసులో ఆనంద్‌గౌడ్ ఏ1 ముద్దాయిగా అరెస్ట్ అయి జైలుకు వెళ్లాడు. ఆ తరువాత కామారెడ్డి జిల్లాలో పని చేసి ఎన్నికలకు ముందు తిరిగి మెదక్ జిల్లాకు వచ్చాడు. కానీ అతని వ్యవహార శైలి మారకపోవడంతో ఇప్పుడు ఏకంగా ఏసీబీకే చిక్కాడు.




## ఐదు యూట్యూబ్ ఛానళ్లను రద్దు

- మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా)

**టి మీడియా, జూలై 13, హైదరాబాద్:**

నటులు, వారి కుటుంబ సభ్యులే లక్ష్యంగా వ్యక్తిగత విమర్శలు, అసత్య వార్తలను పోస్ట్ చేస్తున్న ఐదు యూట్యూబ్ ఛానళ్లను రద్దు చేయించినట్లు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) తెలిపింది. ఇది ఆరంభం మాత్రమేనని, భవిష్యత్‌లో ఇలాంటి ఛానళ్లపై చర్యలు కొనసాగుతాయని ఎక్స్‌వేదికగా పోస్ట్ చేసింది. 'జస్ట్ వాచ్ బీబీసీ%-%, 'ట్రోల్స్ రాజా, 'బచినా లలిత్, 'హైదరాబాద్ కుర్రాడు%-%, 'ఎక్స్‌వైజెడ్ఎడిట్007%-% యూట్యూబ్ ఛానళ్లు రద్దు చేసిన జాబితాలో ఉన్నాయి. హీరోహీరోయిన్లను విమర్శిస్తూ చేసిన వీడియోలను, కామెంట్లను 48గంటల్లో తొలగించాలంటూ డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌కు 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఇటీవల విజ్ఞప్తి చేశారు. ట్రోలింగ్ వీడియోలను డిలీట్ చేయకపోతే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల ఓ తండ్రి-కుమార్తెపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ వీడియో పోస్ట్ చేసిన యూట్యూబర్లపై విష్ణు మండిపడ్డారు.మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే ఊరుకోబోమన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. "ట్రోలింగ్ వీడియోలు చేసే వారికి, అసభ్యకరమైన వీడియోలు చేసే వారికి ఒక 48 గంటలు మాత్రమే సమయం ఇస్తున్నా. దయచేసి అలాంటి వీడియోలన్నీ తక్షణమే తొలగించండి.

ఒకవేళ మీరు తొలగించకపోతే సైబర్ సెక్యూరిటీకి ఫిర్యాదు చేస్తాం.అలాగే మీ యూట్యూబ్ ఛానళ్లు బ్యాన్ అయ్యేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ తరపున ఈ మేరకు మేము అప్పీల్ చేస్తున్నాం. సోషల్ మీడియాలో నటీనటుల మీద ట్రోలింగ్ వీడియోలు చేసినా, డార్క్ కామెడీ పేరుతో వీడియోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పెద్దలను కోరుతున్నా" అని మంచు విష్ణు వీడియోలో విజ్ఞప్తి చేశారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



**టీ మీడియా జులై 13, ఓదెల:**

పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని అఖిల భారత యాదవ మహాసభ యూవజన విభాగంలో, భాగంగా,ఓదెల మండలం,నూతన అధ్యక్షుడిగా బండరీ వర్షిత్ యాదవ్, ఉప అధ్యక్షుడుగా జంగా అజయ్ కుమార్ యాదవ్ ని ఈ రోజు మండల కేంద్రం లో, ఎన్ను కోవడం జరిగింది,రాష్ట్ర కార్యదర్శి వేల్పుల కుమార్ యాదవ్ జిల్లా అధ్యక్షులు అట్ల సాగర్ యాదవ్ కొమ్మ సతీష్ యాదవ్, వినిత్ యాదవ్, సాయి యాదవ్, నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టి- మీడియా న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ
GST IN - 36FDKPS 1308PZX
అన్ని పార్టీలు వారికి రాజకీయ ఉపన్యాస పాయింట్స్
- ప్రత్యేక (డిజిటల్, ప్రింట్) సంచికలు
- సోషల్ మీడియా సర్వీసెస్
- పత్రికలకు వార్తలు, స్టోరీలు
- అన్నిరకాల యాడ్స్ డిజైనింగ్
T MEDIA
tmedia.net.in, epaper.tmedia.net.in, News Agency & Media Consultancy, Youtube Channel, Facebook, Instagram, Twitter
ప్రెస్‌మీట్ ఏర్పాటు, ప్రెస్‌నోట్లు తయారీ, ప్రత్యేక దిన పత్రిక డిజిటల్ ఎడిషన్‌లు కోసం
దేశంలో ఎక్కడి వారు అయిన సంప్రదించండి :
8919710365 కు కాల్ చేయండి

మార్కెటింగ్‌లో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్ పని చేయుటకు కావలెను
టీ మీడియా లోని ప్రింట్ /ఈ పేపర్ /పెళ్లి పందిరి /ఆన్లైన్ విభాగం /ఎలక్ట్రానిక్ విభాగం ల లో (టోటల్ తెలుగు మీడియా) మార్కెటింగ్ లో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్.. (30నుండి 40శాతం )కమిషన్ బేసిక్ పై పని చేయూటకు ఆసక్తి ఉన్నవారు 8500515365 కి పంపగలరు. అవసరం అయిన శిక్షణ ఇస్తాము. నెలకు కనీసం గా రు 20వేలు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.
తమ వివరాలు :
పేరు :...........................................................................
ప్రస్తుత నివాసం :................................చదువు :...........................
సెల్ నెంబర్ :.......................................................................